

# బృందాకృష్ణ

డి.యస్. సుగుణలక్ష్మి

'బృందా! నిన్ను నా హృదయంలో నిలుపుకొని, నా భార్యగా నీకు స్థానం యివ్వడానికి యింకా కొంతకాలము పట్టవచ్చు. అంతవరకూ నీవు...' కృష్ణ ఆపైన మాట్లాడలేదు.

బృంద వంచిన తల యెత్తి కృష్ణ ముఖంలోకి సూటిగా చూసింది. ఆ చూపులో తొలిరేయి సిగ్గు కాని, తన మాటల వల్ల కలుగవలసిన బాధ కాని, మరి ఏవిధమైన భావము కృష్ణకు కనుపించలేదు. తన నిర్ణయము విన్న బృంద ఎంతగానో విలపిస్తుందని, అప్పుడు తను ఆమెను ఎలా సముదాయించాలా అని ఆలోచించుకున్న కృష్ణకు బృంద తనను చూసే తీరుతో నిర్ఘాంతపోయాడు.

'అమ్మకు ఇచ్చిన మాట ప్రకారం, మామయ్య మంచితనంతో ఈ యింటికి కోడలిగా రాగలిగాను. ఇదే చాలు. నువ్వు ఇవ్వలేనిది— నీ నుండి నేను ఎన్నడూ ఏమీ కోరను.' గుండెలు చిన్నగా అదురుతూవుంటే పైకి గంభీరంగా పలికింది బృంద.

తను ఊహించని సమాధానానికి కృష్ణ నిశ్చేష్టుడయ్యాడు. అందునా ఒక పల్లెటూరిలో పుట్టి, ఆ వాతావరణంలో పెరిగిన బృంద నోటి నుంచి తనకు సవాలుగాజవాబు వస్తుందని కృష్ణ వూహించను కూడాలేదు. కృష్ణలోని పురుష భావం దెబ్బతిన్నట్టు అనిపించింది. బృందకేసి చూశాడు. తలుపు దగ్గర తల వంచుకుని, నిలబడి వుంది. జడలోని మల్లె దండలు భుజాల మీదుగాపడి వాటి సువాసనలు గది అంతా నిండివున్నాయి. పాలనురుగ లాంటి తెల్లని జరీ చీరలో బృంద, కృష్ణకు దివి నుంచి భువికేతెంచిన దేవకన్యలా కనిపించింది. రెండడుగులు ముందుకు వేశాడు. కాని తక్కున ఆగిపోయాడు.

* * *

సాయంత్రం నాలుగు గంటలు కావచ్చింది. గదిలో ఒంటరిగా కూర్చున్న కృష్ణ మనస్సు బృంద చుట్టూ తిరగసాగింది. బృంద ప్రవర్తన కృష్ణకు ఆశ్చర్యంతోపాటు పట్టుదల కూడా పెంచసాగినది. తను ఇంకా ముభావంగా వుంటాడు కాని బృంద ప్రవర్తన అంతా సహజంగానే కనిపిస్తూంది. తను పల్లెటూరుది అనుకున్నాడు. బృంద దగ్గర వున్న పనితనం, నేర్పు కృష్ణకు ఎంతో ఆశ్చర్యాన్ని గొలుపుతూంది. ఇల్లంతా ఎంతో నీట్‌గా వుంచుతుంది. తను ఎప్పుడూ ఎంతో హుందాగా ఇల్లంతా తిరుగుతూంది. ఒక గదిలో మంచాలు వేరు. బృందలోని నిగ్రహం, కృష్ణలో ఉద్రేకాన్ని ఒక్కొక్కసారి కలిగిస్తూంది. తను నిరసనగా చూడవలసింది. తన్ను బృంద నిర్లక్ష్యంగా చూస్తుందా? అన్న భావన కృష్ణకు కలిగినప్పుడు కృష్ణ హృదయం బాధగా మూలుగుతూంది. బృంద తనకై తను కృష్ణతో కల్పించుకు మాట్లాడదు. కృష్ణ పిలుస్తే నవ్వుతూ మాట్లాడుతూంది. తను ఎక్కడికి రమ్మన్నా రానన్నదు. తను ఆలశ్యంగా వస్తే ఎందుకు వచ్చారని అడుగదు. బృంద

ప్రవర్తన కృష్ణకు విచిత్రంగా పెద్ద చిక్కుముడిలా కనబడుతూంది. తొలిరేయి తన పొరపాటున ఈనాడు తను బృందను చేరడానికి అభిమానం అడ్డు వస్తూంది. ఆనాడు బృంద తన కిచ్చింది నెమ్మదైన జవాబు కాదు. అది ఒక సవాల్‌లా అనిపించింది. తను నాకోసం బాధ పడవలసింది, నేను బృందకోసంఎందుకు ఇలాఆలోచిస్తున్నాను? కృష్ణకు, బృంద ఒక ఉత్తరము తెచ్చి యిచ్చింది. కృష్ణ ఆ కవరుపైన దస్తూరీ చూశాడు. చటుక్కున తల ఎత్తి బృంద ఉందేమోనని తల ఎత్తాడు. కాని బృంద అక్కడలేదు. కృష్ణ కవరు చింపాడు.

డియర్ కృష్ణా!

నీవు వ్రాసిన ఉత్తరము అందినది. పోనీలే పెళ్ళాము వచ్చింది కదా అని మర్చి పోలేదు. ఇంకా నీ దృష్టిలో నాకు స్థానమిచ్చినందుకు ఆనందముగా వుంది. ఒకసారి రాగలవా? నన్ను రమన్నావా ? పల్లెటూరి శ్రీమతితో పాట్లు ఎలా వున్నాయి. నీ రాక కోసం ఎదురు చూస్తూ...

నీ రేవతి.

కృష్ణ మనసు రేవతి మీదకు మళ్ళింది. కృష్ణ ఆలోచనలు, ముందుకు సాగకుండా బృంద కాఫీ తెచ్చింది. కాఫీ అందుకుంటూ, ఉత్తరము చేతికిచ్చి, 'చదువు' అన్నాడు బృందకేసి చూస్తూ —

మీరు చదువుకున్నారా!

# బృందా కృష్ణ

ఆఁ!

మరింకదేనికి ?

అర్ధాంగివి కదా! అన్ని విషయాలు నీకు తెలియాలి. అందుకని. అన్నాడు నవ్వుతూ! ఉత్తరము చదువుతూంది బృంద— బృందలోని మార్పులు కనిపెడదామన్న కృష్ణకు నిరాశే ఎదురైంది. అంతా చదివి కృష్ణకు ఇచ్చి నవ్వుతూ, అవతల నా కాఫీ చల్లారిపోతుంది అంటూ వెళ్లిపోయింది. ఉత్తరము చదివిన బృంద బాధ పడుతుంది అనీ, అలాంటప్పుడు తన విషయమంతా తను బృందకు చెప్పి పెద్దల మాట కోసం త్యాగం చేసి నిన్ను చేసుకున్నానని, బృందకు ఇంకా ఎన్నో చెప్పాలనుకున్న కృష్ణ చిత్తుగా ఓడిపోయినట్లు ఫీలయ్యాడు.

*　　*　　*

కాఫీ కప్పుతో వచ్చింది బృంద.


'మీ నాన్న ఉత్తరము వ్రాశారు' అన్నాడు బృందకేసి చూస్తూ, ఏమని—అని ప్రశ్నిస్తుందనుకున్న బృంద నుండి ఎలాంటి సమాధానము రాకపోయేసరికి ఉత్తరము బృందకు ఇచ్చాడు. ఉత్తరము చదివి కృష్ణ చేతికిచ్చి ఖాళీచేసిన కప్పు పట్టుకు వెళ్లిపోయింది. బృంద ప్రవర్తన కృష్ణకు విచిత్రంగా కనిపిస్తోంది. తనే బృందను కావాలని దూరం చేసుకుంటున్నానేమో! బృంద ప్రవర్తనలో తన యందు ఆశక్తి వున్న భావమేమి తనకు కనబడ్డంల్లేదు. కాని ఇరువురు కలిసి మూడు నెలలు ఒకే ఇంట్లో, ఒకే గదిలో వేరు వేరు మంచాలమీద రోజులు నడిపిస్తున్నారు. బృందలో ఇది లోపం అని తను అనుకోడానికి కూడా ఏమీ ఆస్కారం లేదు. పుట్టి పెరిగింది పల్లెటూరైనా బృందలోని కనపడని గర్వం, ఒక విధమైన హుందాతనం, మాట చాతుర్యం, మనిషి కదలిక అన్నీ కూడా ఇట్టే ఆకట్టుకుంటాయి ఇతరులని. ఆనాడు బృంద వద్దు అనుకున్న నేను ఈ రోజు ...

కృష్ణకు ఆరోజు రాత్రి బృందజవాబు—సవాల్ తిరిగి గుర్తుకొచ్చింది.


ఆ రాత్రి—

పుస్తకం చేతిలో వుంది. కాని— చూపులన్నీ బృదమీదనే వున్నాయి. కాని బృందకు ఇదేమీ పట్టినట్టు లేదు. కృష్ణ పక్కదులిపి దుప్పట్లు మార్చడంలో లీనమైంది. బృంద జడ ముందుకుపడి మంచాన్ని తాకుతూంది. వంగిన వంపులో పయ్యెద క్రిందనున్న సూత్రాలు—అవే ఆమె సౌందర్యం కృష్ణను మత్తెక్కించినట్టు చేస్తున్నాయి. అమాంతం బృందను ఒకసారి గట్టిగా కౌగలించుకోవాలన్న ఆవేశం వచ్చింది. నిగ్రహం సడలిన కృష్ణ బృంద వెనుకగా నిలబడ్డాడు. అడుగుల శబ్దానికి తల ఎత్తిన బృంద కృష్ణను చూసి ముందు ఆశ్చర్యపడి, తరువాత చిన్నగా నవ్వుతూ పడుకోండి అంటూ ఎదురు చూడకుండా గదిదాటి వెళ్లిపోయింది.

కృష్ణ దెబ్బతిన్నట్లు అనుకున్నాడు, బృంద నవ్వుకు. నీరసంగా మంచం మీదకు వాలాడు. పది నిముషాలు దాటాక బృంద కూడా వచ్చింది. లైటుతీసి తన మంచంమీద పడుకుంది. కృష్ణలో ఉద్రేకం తగ్గి బృంద మీద ఒక విధమైన పట్టుదల కలిగింది. మెల్లగా మాటల్లోకి దింపాడు. 'పండగకి ముందుగా నిన్ను రమ్మన్నారు. వెడతావా?' దుప్పటి పీకదాకా ముసుగు పెట్టుకుంటూ. 'మీ యిష్టం' అంది. 'వెడితే నాఅభ్యంతరం లేదు.' విశాల హృదయంతోఅన్నాడు. ఈసారి బృంద మాట్లాడలేదు. తిరిగి కృష్ణ అన్నాడు.—"నాకు ఇప్పట్లో శెలవులు లేవు. ఆ రోజుకి రావడానికి ప్రయత్నిస్తా. నువ్వువెడితే రేపే వెళ్ళు నా ఫ్రెండ్ ఒకడు ఆ ప్రాంతానికే వస్తున్నాడు. వాడు నీకు సాయంగా



# పనికి తగిన ప్రతిఫలం




భక్తులు కొందరు, తమకు కష్టాలు సంభవించినప్పుడు "ప్రభూ! నీ భక్తుణ్ణి ఇలా కష్టపెట్టడం ధర్మమేనా? నేను నీ యెడల చేసిన అపరాధం ఏమిటి? ఎందుకు ఉపేక్షిస్తున్నావు?" అని నిందించడం కద్దు. అది మానవ స్వాభావికమైన దౌర్బల్యం వల్ల కలిగినదే! ప్రశాంతచిత్తుడై కొంచెం ఆలోచించినట్లయితే లోపం తనలో వుందో, తాను సేవించే దేవునియందు ఉన్నదో తెలుస్తుంది. మంచికైనా— చెడ్డకైనా, కష్టానికయినా— సుఖానికయినా తాను చేసుకున్న కర్మయే కారణమనీ, దానికి తగిన ప్రతిఫలమే తనకు ముడుతుందనీ తెలుసుకుంటే ఆందోళన పడవలసిన అవసరం ఏమీ ఉండదు. దీనిని వివరించే యీ గాథను మనం జ్ఞప్తిలో ఉంచుకోవాలి.

పూర్వకాలంలో సువర్ణముఖీ నదీ తీరాన తపస్సు చేసుకుంటున్న అగస్త్యమహర్షికి శ్రీకాళహస్తీశ్వరునికి అక్కడ దేవాలయం కట్టించాలనే సంకల్పం కలిగింది. ఆ మహర్షి తలచుకుంటే జరగనిదేమున్నది? అతడు వెంటనే పనివాళ్లను పిలిపించి "మీరీ దేవాలయాన్ని నిర్మించాలి. చిత్తశుద్ధితో— పగలల్లా శ్రమపడి పని చెయ్యాలి. ఏ రోజు కూలి ఆ రోజే సాయంత్రం మీకు ముడుతుంది. ఎవరి పనికి తగిన కూలి వారికి తప్పక లభిస్తుంది. మిమ్మల్ని నమ్మి మీకీ పనిని అప్పగిస్తున్నాను. మీ రెలా పనిచేస్తున్నదీ నేను దగ్గర ఉండి చూడనక్కర్లేదు. పగలల్లా నేను తపస్సు చేసుకోవాలి" అని గట్టిగా చెప్పాడు.

అందరూ దానికి సమ్మతించి పని ప్రారంభించారు. ఆ మహాముని ప్రతిరోజూ సాయంత్రం సువర్ణముఖీ సైకతం మీద కూర్చుని, పనివాళ్ల నందర్నీ పిలిపించి, అందరికీ సమానంగానే కొంత కొంత ఇసుక ఇచ్చేవాడు. ఆ ముని ప్రభావం వల్ల ఇసుక బంగారమయి పోయేది. కాని ఆ బంగారం అందరికీ, సమానంగా లభించేది కాదు. కొందరికి ఇసుక పూర్తిగా బంగారమైతే, కొందరికి కొంత మాత్రం సువర్ణమై మిగిలినది ఇసుకగానే ఉండిపోయేది. వారు ఆశ్చర్యంతో ఆ మహామునిని చూడగా, ఆయన "నేను మొదటే చెప్పానుగదా! పనికి తగిన ప్రతిఫలం ముడుతుందని. శ్రమపడి పనిచేసిన వారికి పూర్తి కూలి ముట్టింది. కొంత అశ్రద్ధగా పని చేసినవారికి వారికి తగిన కూలి ముట్టింది. ఏమీ పని చెయ్యకుండా— పని చేస్తున్నట్లు నటించి, ఇటూ అటూ తిరిగిన వారికి ఏమీ ముట్టలేదు. ఇందులో నేను పక్షపాతం చూపలేదు. నేను చూడకపోయినా, మీ రెలా పనిచేస్తున్నదీ, ఆ భగవంతుడు చూస్తూనే ఉన్నాడు" అని అన్నాడు.

ఆ మాట విని ఎవ్వరూ నోరెత్తలేక పోయారు.

---

వుంటాడు." బృంద మీదనున్న అభిమానమంతా వెళ్లబెడుతూ అన్నాడు కృష్ణ. ఇంత చెప్పిన కృష్ణకు—

'అలాగే' అన్న సమాధానం వచ్చింది. నాకు నిద్ర వస్తోంది అని కృష్ణ జవాబు కోసం ఎదురు చూడకుండా ప్రక్కకు తిరిగి పడుకుంది. బృంద సమాధానం కృష్ణకు కోపం తెప్పించింది. లాగి లెంపకాయి కొట్టాలి అన్నంత కోపం వచ్చింది. కాని ఏం చేయగలడు. మీరు రానిదే ఎలా వెడతాను? మీరు ఒక్కరు భోజనానికి ఇబ్బంది పడిపోరా! మొదటిసారి కలిసే వెడదాము. నేను వెళ్లను. ఇలా అంటుందనుకున్న కృష్ణకు ఆశాభంగమైనది. ఔను. ఎందు కంటుంది? తనకు బృందకు తాళిబొట్టు తప్ప తన్ను విడిచి వుండలేను అనుకునే ఆనందాన్ని తనే ఆమెకు ఇవ్వలేదు. తన పొరపాటుకి బృంద ఎంత నిర్దయగా శిక్షిస్తోంది. ఏమైనా తను ఓడిపోగూడదు — అనుకుంటూ ముఖం మీంచి దుప్పటి కప్పుకుని బింకంగా పడుకున్నాడు.

* * *

పండుగలు సరదాగానే గడిచిపోయాయి. మామగారు వుండమన్నా కృష్ణ శలవులు లేవు, వెళ్లి తీరాలి అన్నాడు. బృందా! రేపే ప్రయాణం. పాలగ్లాసు ఇవ్వడానికి వచ్చిన బృందతో అన్నాడు.

'నాన్న నాల్గు రోజులు వుండమంటున్నాడు.' బృంద నవ్వుతూ అంది.

'అయితే నువ్వు వుంటావా?' కృష్ణ ప్రశార్థకంగా అడిగాడు. కృష్ణ ముఖం చూస్తే బృందకు నవ్వు వచ్చింది. ముఖం మీద పడ్డ జుట్టు వెనక్కు తీసుకుంటూ 'మీ యిష్టం' అంటూ కృష్ణకు దూరంగా మంచం మీద కూర్చుంది. ఇచ్చిన అవకాశం జారవిడుచుకోకుండా 'రేపే మన ప్రయాణం' అన్నాడు. 'సరే పడుకోండి' అంటూ బృంద గదిలోంచి వెళ్లిపోయింది.

ఈ రెండు రోజులు కూడా వేరు మంచాలయినా ఒకే గదిలో పడుకున్నారు. ఇంకా బృంద తిరిగి రాకపోవుటచే గంట గడిచాక కృష్ణ గదిలోనుంచి బయటకు వచ్చాడు. ఎక్కడా బృంద జాడ కనపడలేదు. హాల్లో మామయ్య మంచంమీద పడుకుని నిద్రపోతున్నాడు. మరి బృంద ఎక్కడి కెళ్లినట్లు? అలాగే నిలబడ్డాడు. వంటగదిలోకి వెళ్లాడు. అక్కడా లేదు. వంటగది తలుపు దగ్గరగా వేసివుంది. తలుపు తెరచుకుని పెరటిలోకి వెళ్లాడు. బయట వెన్నెల పిండారబోసినట్టుంది. తలుపు తెరవగానే సన్నజాజుల వాసన గుప్పుమనిపించింది. పందిరికి పక్కగా మంచంమీద పడుకుని వుంది బృంద. ముఖం మాత్రం తలగడలో దూర్చి బోర్లాపడుకుంది. శబ్దం చెయ్యకుండా కృష్ణ మంచందగ్గరగా వెళ్లాడు. చిన్నగా వెక్కిళ్లు వినవచ్చాయి. బృంద ఏడుస్తోందని గుర్తించాడు. తనతో రావడానికా? లేక ఇక్కడ వుంటానంటే వీలు

## తెలుగు పుస్తకములు

| | |
|---|---|
| దైవ ఆరాధనలు | రు.15 |
| వివిధ సాధన రహస్యాలు | రు.10 |
| మంచిమంచి హాస్యకథలు | రు. 9 |
| దాంపత్య రహస్యాలు | రు.10 |
| కామ సూత్రాలు | రు.10 |
| ప్రకృతివైద్యము (అన్నిరోగములకు) | రు.16 |
| గర్భ నిరోధ మార్గాలు (బొమ్మలతో) | రు.10 |
| స్వప్న వివరాలు (గూఢ అర్థాలతో) | రు. 9 |
| సంపాదన మార్గాలు (చిన్న పరిశ్రమలు) | రు.10 |
| 500 రోగముల నివారణకు మందులు | రు.30 |

4 పుస్తకములకు పోస్టేజి ఉచితం
అడ్వాన్సు రు. 2.00 పంపిన వారికి VPP పంపబడును.
ఉషా బుక్ సెంటర్
గాంధీనగరం, తాడేపల్లిగూడెం-1 A.P

## దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొంద లేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషనులేకుండ రండి.

డా॥ దేవర
5/1, బ్రాడిపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17, మార్వాడిగుడివద్ద, తెనాలి.




SHREE BAIDYANATH AYURVED BHAWAN PVT. LTD. CALCUTTA

# బైద్యనాథ్ చ్యవన్‌ప్రాశ్ స్పెషల్

- శరీర కండరములను బలపరుచును. శక్తివంతముగా చేయును.
- శరీరమునకు శక్తిని ప్రసాదించి రోగ క్షమతను కలుగచేసి, పునరుజ్జీవనము కలుగ చేయును.
- దగ్గు, జలుబు మొదలగు శ్వాసకోశ వ్యాధులనుండి కాపాడును.
- పాండు, మరియు కాల్షియం తగ్గుదలలో అత్యంత ప్రయోజనకారిగా నుండును.
- సహజమైన వనమూలికలచే తయారు చేయబడి నందున సులభముగా జీర్ణమగును.




కుటుంబాని కంతటికీ
ఉత్తమమైన ఆయుర్వేద టానిక్

INTERMARK/CHS/13T


# బృందా కృష్ణ

లేదన్నదానికా ? ఏ విషయమో కృష్ణకు తెలియలేదు.

ఆ వెన్నెటో మంచంమీద బోర్లా పడుకుంది. తెల్లటి చీర, జడలో విరిసిన జాజులు కృష్ణకు ఒక్కసారి అమాంతం బృందను ఏదో చెయ్యాలన్న కోరిక. కృష్ణ మనసులో ఏదో కోరిక.

బృందా ! అంటూ మెల్లగా తట్టాడు.

బృంద కంగారుగా లేచింది. కృష్ణను చూసి నిర్ఘాంత పోయింది. నువ్వా ! మీరా అంది కంగారుగా. కృష్ణ అమాంతం బృందను తన రెండు చేతులలోకి తీసుకుని బృందా అన్నాడు మైకంగా. కాని బృంద కృష్ణను విడిపించుకుంటూ నాన్న వస్తున్నాడు అంది. కృష్ణ కంగారుగా అటు తిరగటంతో బృంద పరుగులాంటి నడకతో ఇంట్లోకి వెళ్ళిపోయింది. కృష్ణ అహం దెబ్బతిన్నట్లు అనిపించింది. ఎంత నిరసనా ! ఇది తను సహించలేడు. కృష్ణ మనసులో పగ, బృంద మీద కోరిక పోటీగా దెబ్బలాడుకో సాగాయి. గదిలోకి వచ్చాడు. బృంద మంచం మీద దుప్పటి పూర్తిగా కప్పుకు పడుకుంది. కృష్ణ తన మంచం మీదకు వెళ్లి పడుకున్నాడు.

బృంద మనసంతా అదోలా వుంది. తను ఇంతవరకూ బాధపడ్డది ఎందుకూ !

## గర్వించే పర్వదినం

విచ్చేసెను దసరా పండుగ
ముచ్చట్లను నింపుచు నిండుగ
ఎద ఎదలో విరిసిన భోగం
కదలికలో వెలసిన స్వప్నం
గంగెద్దూ—పులివేషాలు—
అయ్యవారూ— దసరాపిల్లలు
ఇంటింటా పప్పూబెల్లం
ఏటేటా మన ఆచారం—
పార్వేటకు దైవం కదలును
అత్తింటికి అల్లుడు నడచును
రుచి రుచిగా భోజ్యం సేవన
ప్రతిగుండెకు సమతాభావన
ప్రత్యణువున 'కల' చిగురించుట
వేడుకలో మది మైమరచుట.

— రంగకవి

అరా బావ దగ్గరకు వస్తే తను ఎందుకలా ప్రవర్తించింది. బావ ఏమనుకుంటాడు - ఇక తన ముఖము చూడడు. ఎంతకాలం తను యిలాంటి ఒంటరి జీవితం గడుపుతుంది. బావకు తన లెక్క ఏమిటి? రేవతి—భారతి—ఎంతమందో—కాని తను... బృందకు ఆ రాత్రి తెల్లవార్లూ నిద్ర లేదు.

కృష్ణకు బృంద మీద పగ పెంచుకోవడంతోటి తెల్లవారిపోయింది. కృష్ణ ప్రయాణమయ్యాడు. బృంద వస్తానంది. కాని కృష్ణ మామగారి ముందు వినయంగా 'వారంరోజులుండు బృందా' అన్నాడు. కాని బృంద వినిపించుకోలేదు. కృష్ణ ఎదురుగానే 'నాన్నా!బావ హోటల్లో భోజనం చెయ్యడు! అదిగాక ఈ మధ్య ఒంట్లో కూడా అంతగా బాగుండటల్లేదు. ఈసారి వచ్చినప్పుడు వుంటా' అంది. తండ్రి వారి అన్యోన్యానికి సంబరపడిపోతూ, అలాగేనమ్మా అన్నాడు.

కృష్ణ కోపంగా బృంద వంక చూశాడు. బృంద నవ్వుతూ 'రిషా తెండి'అంది.

* * *

యధాప్రకారం రోజులుగడిచిపోతున్నాయి. ఎవ్వరికీ తృప్తిగాలేదు. కాని యిరువురూ పట్టుదల మీద తిరుగుతున్నారు. అలాంటి సమయంలో రేవతి వచ్చింది. కృష్ణ సంతోషంతో పలుకరించాడు. అంతకన్నా ఆనందాన్ని బృంద వ్యక్తపరచింది. రేవతి వున్నన్ని రోజులూ ముగ్గురూ కలిసే తిరిగారు. ఒక్కొక్కసారి రేవతి, కృష్ణ కూడా వెళ్లేవారు. రేవతితో చనువుగా వుంటే బృంద ఈర్ష్యపడి తనకు చేరువ అవుతుందని అనుకున్నాడు కృష్ణ. అందుకే కావాలని రేవతితో అతి చనువుగా ప్రవర్తించేవాడు.

కాని బృందలో ఎలాంటి చలనం కలుగలేదు. కావాలని తనే వారికి అలాంటి అవకాశాలు చాలా కల్గించింది. భార్యా భర్తల మనసులోని వుద్దేశ్యాలు ఎంత మాత్రం రేవతికి అంతుబట్టలేదు. కాని వచ్చినందుకు రోజులు సరదాగానే గడిచిపోతున్నాయి, అనుకుంది. తెల్లవారితే రేవతి వెళ్లిపోతుంది.

ఆ రోజు కృష్ణతో అంది బృంద— చీర, జాకెట్టు తేవాలి అని. ఎందుకూ? అన్నాడు కృష్ణ.

రేపు రేవతి వెళ్లిపోతుంది అంది.

నేలమీద బొటన వ్రేలితో వ్రాస్తూ బృందను ఏడిపించాలని, రేవతి ఇంటి ఆడబడుచుకాదు. నా స్నేహితురాలు, అన్నాడు వెటకారంగా—

పోనీ మీకు కాకపోవచ్చు. నాకు అప్పగారిగా పెట్టాలని వుంది. తెస్తారా అంది.

ఈసారి కృష్ణ నిర్ఘాంతపోయాడు. 'నీకు ఏ వరసని అప్పగారు' అన్నాడు తేరుకుని.

బృంద నవ్వుతూ 'మీకూ— నాకూ ఏ వరుసకాదు.నేనూస్నేహితురాలిగానే తెమ్మన్నా! మీరు అలా అంటే నవ్వుతూ అన్నా' అంది, తిరిగి నవ్వుతూ.

కృష్ణ అడుగు ముందుకు వేసి 'మాటలు నేర్చిన జాణవు' అన్నాడు.

"అక్కడే ఆగాలి కృష్ణగారూ!"అంటూ వెళ్ళిపోయింది.

రేవతి ఇద్దరినీ మనస్పూర్తిగా అభినందిస్తూ వెళ్లిపోయింది.

ఆ రోజు రాత్రి బృంద కవరు విప్పసాగింది.

'ఏమిటి' అన్నాడు కృష్ణ! రేవతి ఇచ్చింది అంటూ చదువుకోసాగింది.

బృందా!

మీ ఆతిధ్యానికి సర్వదా కృతజ్ఞురాలిని. కృష్ణ స్వభావం నాకన్నా నీకే తెలుసు. కానీ ఫ్రెండ్‌గా వ్రాస్తున్నా. కృష్ణ హృదయంలో నీకు తప్ప మరి ఎవ్వరకీ స్థానం లేదు. అది నాకు బాగా తెలిసింది. కృష్ణ నిన్ను ఎంతగా కోరుతున్నాడంటే... మరి కొన్నాళ్లు మీరు ఇలాగే వుంటే కృష్ణ మరి నీకు దక్కడు. కృష్ణ నిన్ను దూరం చేసుకోకుండానే నువ్వు కృష్ణకు చేరువవ్వాలి. ఆఁ ఇక నీ తీయని శిక్ష చాలు.

రేవతి.

ఉత్తరం చదివి కృష్ణవైపు చూసింది. కృష్ణ కళ్ళు మూసుకు పడుకున్నాడు.

'బావా!' అంది మెల్లగా. కృష్ణ కళ్ళు తెరిచాడు. ఎందుకన్నట్టు చూశాడు.

'చలిగా' వుంది అంది.

కృష్ణ కంగారుగా'పడుకో, రగ్గు కప్పుతా' అన్నాడు.

బృంద కళ్ళు మూసుకు పడుకుంది.

రగ్గు తెచ్చి కప్పాడు. కాని బృంద యింకా వణుకుతూనే వుంది.

'ఇంకా చలిగా వుందా బృందా?' అన్నాడు కంగారుగా.

రగ్గు తొలగించి కృష్ణ కేసి చూసింది. కృష్ణ ఏమిటన్నట్టు చూశాడు. బృంద రేవతి ఉత్తరం కృష్ణ చేతిలో పెట్టి తిరిగి రగ్గు కప్పేసుకుంది. కృష్ణ ఉత్తరం చదివాడు. బృందవేపు చూశాడు. నిండుగా కప్పేసుకుంది.

కృష్ణ లైటు ఆర్పి,'బృందా!' అన్నాడు. కాని బృంద పలుకలేదు. కృష్ణలో ఇక నిగ్రహం లేదు. ఇరువురి మనసులూ ఒకేలా ఉన్నాయి. దుప్పటి తొలగించి తనూ బృంద ప్రక్కలో చేరి ఇరువురికి కలిపి కప్పేశాడు.

## అమెరికాకి జాబు

అమెరికాకి ఎగిరిపోయిన
మైడియర్ లక్ష్మీపతీ! ఇలాగ
ఉందోయ్ నా పరిస్థితి
నా చాలీ చాలని జీతం నా చేత
పాడిస్తున్నది రోజూ విప్లవగీతం!
ఈ దేశంలో
ప్రాచీన సంస్కృతికి
ఇస్తారోయ్ ఎక్కువ విలువ
ఎక్కువయినాయోయ్
నాయకుల వాగుళ్లు!
కాని, వారు కనిపెట్టలేదు
సంసారంలో దిగుళ్లకు
సమాజంలో తెగుళ్లకు
సరిఅయిన విరుగుళ్లు
ఇంకా నాబోటివాళ్లు
ఎక్కువగా మాట్లాడ్తే
కుట్టేస్తారోయ్ మా నోళ్లు!
ఇవాళ నీ పొజిషన్
కవిత్వానికే ఒక యెమోషన్
నాకు సుఖం మిగిలినా
మిగలకపోయినా
అమెరికాకి ఎగిరిపోయిన
నీలాంటి వాళ్లని
తల్చుకుంటూ కవిత్వం
పాడుకుంటూ ఉంటా
వీలైతే అక్కడి వింతలు
తిరుగు టపాలో రాయి!

— చివుకుల రామేశ్వర్